


జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348
# సందేశం టైమ్స్
నిజం దాగదు – వార్త ఆగదు




| గురువారం 18 జూన్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 02 సంచిక : 016 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాహుల్ గాంధీకి ఉత్తరాల ఉద్యమం – బక్క జడ్సన్




హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 18, 2026: తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ అగ్రనేత శ్రీ రాహుЛЬ గాంధీ గారి దృష్టికి తీసుకెళ్లేందుకు రేపు నిరుద్యోగుల తరఫున పెద్ద ఎత్తున ఉత్తరాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మాజీ ఏఐసీసీ సభ్యులు, మాజీ ఏపీపీసీసీ చైర్మన్ బక్క జడ్సన్ తెలిపారు. తెలంగాణలో లక్షలాది మంది యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం నిరుద్యోగ యువత ఆశగా ఎదురుచూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ గారికి పంపే ఉత్తరాలలో ప్రధానంగా గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 మరియు డీఎస్సీ (DSC) ఉద్యోగ నోటిఫికేషన్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేయనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం 67,760 ఉద్యోగాలు ఇచ్చామని ప్రకటిస్తున్నప్పటికీ, ఆ ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి వివరాలు, శాఖల వారీగా నియామకాల లెక్కలను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని కోరారు. అలాగే రాష్ట్రంలో సుమారు 15 లక్షల మంది యువత పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నేపథ్యంలో, కనీసం 20,000 పోలీస్ పోస్టులతో కొత్త నియామక నోటిఫికేషన్ విడుదల చేయాలని, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల గరిష్ట వయోపరిమితిని 36 సంవత్సరాలకు, ఎస్సై అభ్యర్థుల వయోపరిమితిని 37 సంవత్సరాలకు పెంచాలని డిమాండ్ చేశారు. దీనితో పాటు జీవో నెం.46 వల్ల నష్టపోయిన అభ్యర్థులకు తక్షణమే న్యాయం చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో శ్రీమతి ప్రియాంక గాంధీ ప్రకటించిన నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు నెలల్లో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ తీవ్ర నిరాశకు గురై మంచిర్యాలకు చెందిన హరీష్, ఆదిలాబాద్‌కు చెందిన కంబ్లే అమిత్ కుమార్, పెద్దపల్లికి చెందిన ముదటనపల్లి చరణ్, మంచిర్యాలకు చెందిన కిరణ్, హైదరాబాద్‌కు చెందిన నెనావత్ సిద్ధార్థ్, ఖమ్మంకు చెందిన భవాని అనే ఆరుగురు నిరుద్యోగ యువత ఆత్మహత్యలకు పాల్పడటంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, ఈ ఘటనలపై ఇప్పటికే జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC)లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ డిమాండ్లకు మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం కొనసాగుతోందని, అందులో భాగంగా నల్గొండ మరియు ఖమ్మం జిల్లాల్లో నిరుద్యోగ యువత నుంచి భారీగా సంతకాలు సేకరించడం జరిగిందని పేర్కొన్నారు. నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, యువత భవిష్యత్తుతో ఆటలు ఆడకుండా పారదర్శకమైన ఉద్యోగ నియామక ప్రక్రియ చేపట్టాలని, నిరుద్యోగుల గొంతుకను రాహుల్ గాంధీ గారి దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ ఉత్తరాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బక్క జడ్సన్ హెచ్చరించారు.

## వట్‌పల్లి పోలీస్ స్టేషన్, జోగిపేట సర్కిల్ కార్యాలయాలలో జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ వార్షిక తనిఖీ







వట్పల్లి, సందేశం టైమ్స్, స్టేట్ కోఆర్డినేటర్ టీ సంగమేశ్వర్, జూన్ 18, 2026: సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండల కేంద్రంలో వార్షిక తనిఖీలలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపీఎస్ బుధవారం వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌తో పాటు జోగిపేట సర్కిల్ కార్యాలయాన్ని విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం, డీఎస్పీతో కలిసి స్టేషన్ ఆవరణలో మొక్క నాటడంతో పాటు నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించారు. ఆ తర్వాత స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్, రికార్డుల నిర్వహణ, వివిధ కేసులకు సంబంధించిన వాహనాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని, మిస్సింగ్ కేసులు, లాంగ్ పెండింగ్ కేసుల త్వరితగతిన పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఆస్తి నేరాలు అధికంగా నమోదవుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి పగలు, రాత్రి బీట్‌లలో నిఘా పెంచాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి తగిన భరోసా కల్పించాలని, విలేజ్ పోలీస్ అధికారులు తమ గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండి గ్రామ పెద్దలు, యువతతో సత్సంబంధాలు కొనసాగించాలని తెలిపారు. ముఖ్యంగా సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, సైబర్ క్రైమ్ పోర్టల్, సీఈఐఆర్ వంటి అత్యాధునిక సాంకేతిక అప్లికేషన్లపై సిబ్బంది పూర్తి స్థాయి పట్టు సాధించి నేర నియంత్రణలో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అనంతరం జోగిపేట సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డుల నిర్వహణను పరిశీలించిన ఎస్పీ, గ్రేవ్ మరియు నాన్-గ్రేవ్ కేసులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాద ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెంచి, ముఖ్యంగా హైవేల వెంబడి ఉండే దాబాలు, పెట్రోల్ బంకుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. మారుతున్న సమాజానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేసిన ఎస్పీ, వట్‌పల్లి పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాల నిర్వహణ సంతృప్తికరంగా ఉందని పేర్కొంటూ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ సత్యయ్య గౌడ్, సీఐ అనిల్ కుమార్, ఎస్ఐలు శ్రీహరి, శ్రీకాంత్ మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ - 2026 అమలుపై జిల్లా ప్రజలకు అవగాహన ఉండాలి: డీపీఓ యాదయ్య



మెదక్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 18, 2026: భారత సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్-2026 ఈ ఏడాది ఏప్రిల్ 1 నుండి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చాయని, దీనిపై మెదక్ జిల్లా ప్రజలందరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 492 గ్రామ పంచాయతీలలో ఈ నూతన నియమాల ప్రకారం ప్రతి ఇంటి వద్దనే చెత్తను నాలుగు రకాలుగా వేరు చేసి గ్రామ పంచాయతీకి అందజేయడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. చెత్తను వేరు చేయకుండా ఇస్తే గ్రామ పంచాయతీ సిబ్బంది దానిని స్వీకరించరని, ఎవరైనా రోడ్ల మీద చెత్త వేస్తే రూ.500 జరిమానా విధించబడుతుందని వివరించారు. గతంలో చెత్తను మూడు రకాలుగా వేరు చేసేవారని, అయితే ప్రస్తుతం నాలుగు రకాలుగా వర్గీకరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందులో మొదటిది తడి వ్యర్థాలు (కట్ చేసిన కూరగాయల తొక్కలు, ఆహార అవశేషాలు, పండ్ల వ్యర్థాలు, పూలు, ఆకులు మరియు ఇతర జీవ వ్యర్థాలు), రెండవది పొడి వ్యర్థాలు (పేపర్, ప్లాస్టిక్, రబ్బరు, లోహాలు, గాజు, చెక్క, వస్త్రాలు మరియు ఇతర రీసైక్లింగ్ చేయదగిన వ్యర్థాలు), మూడవది పారిశుధ్య వ్యర్థాలు (డైపర్లు, శానిటరీ న్యాప్కిన్లు, మాస్కులు, కండోమ్స్ మరియు ఇతర వ్యక్తిగత పరిశుభ్రతకు సంబంధించిన వ్యర్థాలు), మరియు నాలుగవది ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలు (వాడిన ఇంజెక్షన్లు, మెడికల్ వ్యర్థాలు, రసాయన మందుల ఖాళీ డబ్బాలు, రంగుల డబ్బాలు, బ్యాటరీలు, మొబైల్ చార్జర్లు, ఎలక్ట్రికల్ వైర్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషీన్లు, రైస్ కుక్కర్లు, ఎయిర్ కూలర్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) గా విభజించాలని వివరించారు. గ్రామ స్థాయిలో సర్పంచ్‌లు, వార్డు సభ్యులు లీడ్ ఫెసిలిటేటర్లుగా వ్యవహరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని, ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు విధిగా దీనిని పాటించాలని కోరారు. గ్రామ స్థాయి అధికారులు దీని గురించి తమ స్టేక్‌హోల్డర్స్‌కు వివరించాలని, గ్రామ పంచాయతీలు చెత్త సేకరణ కోసం ఉపయోగించే ట్రాక్టర్లలో నాలుగు రకాల చెత్తను విడివిడిగా సేకరించేందుకు ప్రత్యేక క్యాబిన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సేకరించిన చెత్తను గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించి శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలని, తడి చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారు చేయాలని, పొడి చెత్తను పేపర్, ప్లాస్టిక్, రబ్బరు, మెటల్, గాజు, చెక్క మరియు వస్త్రాలుగా వేరు చేసి గుర్తింపు పొందిన రీసైక్లింగ్ ఏజెన్సీలకు పంపించాలని తెలిపారు. ఇందుకోసం గ్రామ పంచాయతీలు సమీపంలోని ప్లాస్టిక్ మరియు ఇతర స్క్రాప్ డీలర్లు లేదా రీసైక్లింగ్ సంస్థలను గుర్తించి వాటితో ఒప్పందాలు చేసుకోవాలన్నారు. శానిటరీ చెత్తను నిబంధనల ప్రకారం ఇన్సినరేటర్లలో నిర్వీర్యం చేయాలని, ప్రత్యేక జాగ్రత్త చెత్తను కూడా వేరు చేసి అధీకృత రీసైక్లింగ్ యూనిట్లకు పంపించాలని పేర్కొన్నారు. డంపింగ్ యార్డులలో వ్యర్థాలను భూమిలో పూడ్చివేసే (Landfill) విధానాన్నిగణనీయంగా తగ్గించడమే ఈ నూతన నియమాల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. అదేవిధంగా బల్క్ వేస్ట్ జనరేటర్లు (Bulk Waste Generators) అనగా 20,000 చదరపు మీటర్లకు పైగా నిర్మాణ విస్తీర్ణం కలిగిన సంస్థలు, రోజుకు 40,000 లీటర్లకు పైగా నీటి వినియోగం చేసే సంస్థలు లేదా రోజుకు 100 కిలోగ్రాములకు పైగా వ్యర్థాలు ఉత్పత్తి చేసే సంస్థలు తమ వ్యర్థాలను స్వయంగా శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాల్సి ఉంటుందని, మన జిల్లాలో నేటి వరకు 11 బల్క్ వేస్ట్ జనరేటర్ సంస్థలు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (CPCB) ఆన్లైన్ సైట్ పోర్టల్‌లో రిజిస్టర్ కాబడ్డాయని వెల్లడించారు. మెదక్ జిల్లాలోని గౌరవ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, అధికారులు, మహిళా సంఘాలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్-2026 అమలులో భాగస్వాములు కావాలని, గ్రామాలను పరిశుభ్రంగా మరియు ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని డీపీఓ యాదయ్య కోరారు.

## ఓటర్ల జాబితా సవరణ, వ్యర్థాల నిర్వహణ, డ్రగ్స్ రహిత జిల్లా నిర్మాణాలపై కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ విస్తృత సమీక్ష







సూర్యాపేట, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 18, 2026: సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పారదర్శకంగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ రాజకీయ నాయకులు పూర్తి సహకారం అందించాలని కోరారు; ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 18న బూత్ లెవెల్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారియోకు క్షేత్రస్థాయి సన్నాహక శిక్షణ ఇస్తారని, జూన్ 25 నుండి జూలై 24 వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలను సేకరిస్తారని, జూలై 24 నుండి 30 వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారని తెలిపారు, అలాగే ఓటర్ల ముసాయిదాను జూలై 31న ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని, 01-10-2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడిస్తూ, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్ 31 ప్రకారం తప్పుడు సమాచారం ఇస్తే ఒక సంవత్సరం జైలు శిక్ష లేదా జриమానా విధిస్తారని హెచ్చరించారు. అనంతరం పట్టణాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ (సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్)ను మరింత పటిష్టం చేసి, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశిస్తూ సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపాలిటీల పరిధిలో ఎండ్-టు-ఎండ్ వ్యర్థాల సేకరణ, శానిటేషన్ ప్లాన్ అమలుపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కొత్త మార్గదర్శకాల ప్రకారం పొడి చెత్త, తడి చెత్త, శానిటరీ వ్యర్థాలు, స్పెషల్ కేర్ వ్యర్థాలను వేర్వేరుగా నాలుగు విభాగాలుగా సేకరిస్తున్నట్లు తెలిపి, తడి చెత్త, కూరగాయల వ్యర్థాల శాశ్వత పరిష్కారానికి సూర్యాపేట, కోదాడ మున్సిపాలిటీల్లో మార్కెట్ ప్రాంతాల సమీపంలో బయో మిథనేషన్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని, రవాణా ఖర్చులు తగ్గించే దిశగా ఉమ్మడి ప్లాస్టిక్ వ్యర్థాల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఇదే క్రమంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణా నిరోధక దినోత్సవం – 2026 సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ నషా ముక్త్ ౼ఌ అభియాన్‌లో భాగంగా పదిరోజుల ప్రణాళిక అయిన "నషా ముక్త్ సప్తాహ్" (Nasha Mukt Saptah) పోస్టర్లను ఆВИష్కరించి, సూర్యాపేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని, ఆన్‌లైన్ లింక్ ద్వారా భారీ ఈ-ప్రతిజ్ఞ (Mass E-Pledge Drive) కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ విస్తృత కార్యక్రమాలలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి డి. ప్రేమ్ రాజ్, మున్సిపల్ కమిషనర్లు హనుమంత రెడ్డి, రమాదేవి, నాగరాజు, సతీష్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహా రావు, డీఈఓ అశోక్, డిఐఈఓ సులోచన రాణి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రాజేశ్వర్ రావు, అంజాద్, కరుణాకర్ రెడ్డి, సత్యనారాయణ, అభిద్, గోపి, స్టాలిన్ మరియు మున్సిపల్ సిబ్బంది, ఇతర అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ యువతకు అంతర్జాతీయ విద్యా, క్రీడా నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చర్చ



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 18, 2026: తెలంగాణ యువతకు ప్రపంచ స్థాయి విద్య, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రతిష్ఠాత్మక చిచెస్టర్ విశ్వవిద్యాలయం ప్రతినిధులతో రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామిక అభివృద్ధి, మత్స్య, క్రీడలు & యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించి విద్యా సహకారం, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, ఉన్నత విద్యా అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా చిచెస్టర్ యూనివర్సిటీలో కోచులకు ఇచ్చే శిక్షణ, క్రీడాకారులకు నైపుణ్యతపై అవగాహన, స్కిల్ డెవలప్మెంట్ వంటి వివిధ క్రీడా మరియు విద్యా సంబంధిత అంశాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్రం మరియు చిచెస్టర్ విశ్వవిద్యాలయం మధ్య విద్యా, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో పరస్పర సహకార అవకాశాలను పరిశీలించిన మంత్రి, రాష్ట్ర యువత అంతర్జాతీయ స్థాయి విద్యను అందిపుచ్చుకుని ప్రపంచ ఉద్యోగ మార్కెట్‌లో సమర్థవంతంగా పోటీపడేలా వినూత్న భాగస్వామ్య కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు. దీనికి స్పందించిన విశ్వవిద్యాలయ ప్రతినిధులు తమ విద్యా కార్యక్రమాలు, పరిశోధన అవకాశాలు, అంతర్జాతీయ విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ప్రత్యేక పథకాలు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాల గురించి వివరించడంతో పాటు, తెలంగాణ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య, గ్లోబల్ ఎక్స్‌పోజర్ కల్పించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నట్లు మంత్రికి తెలిపారు. అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధులను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, చిచెస్టర్ విశ్వవిద్యాలయ ప్రతినిధి ఒలివియా మెక్‌లాగ్లిన్, సంబంధిత శాఖల అధికారులు మరియు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాత్రికేయ కుటుంబాలకు అండగా తెలంగాణ మీడియా అకాడమీ – చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి




హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 18, 2026: జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాంపల్లిలోని తెలంగాణメディア అకాడమీ ఆడిటోరియంలో నిర్వహించిన జర్నలిస్టుల సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన 21 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ సంక్షేమ నిధి పథకం కింద లబ్ధి పొందిన వారిలో 17 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబ సభ్యులు మరియు నలుగురు అనారోగ్యానికి గురైన జర్నలిస్టులు ఉన్నారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వాన ఏర్పడిన ప్రజా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమ నిధి పథకం కింద మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు రూ.1,00,000 ఏకమొత్తం ఆర్థిక సహాయం అందించడంతోపాటు ఐదు సంవత్సరాల పాటు నెలకు రూ.3,000 పెన్షన్, అలాగే కుటుంబంలోని గరిష్టంగా ఇద్దరు పిల్లలకు నెలకు రూ.1,000 చొప్పున ట్యూషన్ ఫీజును అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి 159 మందికి ఇలాంటి ఆర్థిక సహాయాన్ని విజయవంతంగా అందించినట్లు ఆయన స్పష్టం చేశారు. అనంతరం సభలో పాల్గొన్న వారందరూ తమ మధ్య నేడు లేని పాత్రికేయులను స్మరించుకుంటూ వారికి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘన నివాళులు అర్పించారు. మరణించిన జర్నలిస్టుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ విస్తృత కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వర రావు, మేనేజర్ శైలేశ్వర్ రెడ్డి, పలువురు సీనియర్ జర్నలిస్టులు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# జిన్నారం శివాలయం అభివృద్ధికి రూ. 36 లక్షల సొంత నిధులు అందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి





పటాన్చెరు, సందేశం టైమ్స్, బి. డేవిడ్, జూన్ 18, 2026:సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో గల శ్రీ జీవన జ్యోతిర్లింగ శివాలయం ఆవరణలో 36 లక్షల రూపాయల సొంత నిధులతో నిర్మించనున్న శివాలయం మండపం నిర్మాణ పనులకు బుధవారం ఉదయం పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయం అభివృద్ధికి గతంలో కూడా 16 లక్షల రూపాయల సొంత నిధులు అందించడం జరిగిందని గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో దేవాలయ సమగ్ర అభివృద్ధికి తన వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ అందిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. శంకుస్థాపన అనంతరం ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, తహసిల్దార్ ఆంథోనీ, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు మరియు నోటు బుక్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జిన్నారం, సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్, జూన్ 18, 2026: సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థిని, విద్యార్థులకు పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం సొంత నిధులతో బెంచీలు అందిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు ఇష్టపడి చదివి తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించాలని ఆయన అభిలాషించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, వైస్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకటేష్ గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ కళింగ కృష్ణ కుమార్, ప్రజా ప్రతినిధులు మరియు నాయకులు పాల్గొన్నారు.

## సంగారెడ్డి జిల్లాలో ఎస్ఐల బదిలీలు – జోగిపేట ఎస్ఐకి స్థానచలనం



| SL. No. | Name S/Sri. | Rank | Present place of Posting | Transferred and posted to |
|---|---|---|---|---|
| 1. | A.Aravind | SIP | V.R, Vikarabad | SI, Munipally PS of Sangareddy Dist. |
| 2. | Rajesh Naik | SIP | SI, Munipally PS of Sangareddy Dist. | V.R., Sangareddy |
| 3. | Giri Srikanth | SIP | V.R., Sangareddy | SI, Jogipet PS of Sangareddy Dist. |
| 4. | P.Pandu | SIP | SI, Jogipet PS of Sangareddy Dist. | V.R., Sangareddy |
| 5. | K.Vinay Kumar | SIP | V.R., Sangareddy | SI, Chiragpally PS of Sangareddy Dist. |
| 6. | K.Rajender Reddy | SIP | SI, Chiragpally PS of Sangareddy Dist. | SI, Zaheerabad Rural PS of Sangareddy Dist. |
| 7. | M.Kashinath | SIP | SI, Zaheerabad Rural PS of Sangareddy Dist | V.R., Sangareddy |

CIs concerned are instructed to relieve the above SIs with instructions t report at their new place of postings immediately and intimate the date of reli and reporting to this Office, without fail.

The Superintendent of Police, Vikarabad District is requested to reliev the above SI in SL.No.1, with instrutios to report in this unit for further duti and intimate the date of relief to this Office for record.

అందోల్, సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి, జూన్ 18, 2026: సంగారెడ్డి జిల్లా పోలీసు శాఖలో ఎస్ఐల బదిలీలు చోటుచేసుకున్నాయి. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లను వివిధ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీలలో భాగంగా జోగిపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ పి. పాండు గారిని సంగారెడ్డి వీఆర్‌కు బదిలీ చేయగా, సంగారెడ్డి వీఆర్‌లో ఉన్న గిరి శ్రీకాంత్‌ను జోగిపేట ఎస్ఐగా నియమించారు. అలాగే జిల్లాలోని ఇతర పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న పలువురు ఎస్ఐలకు కూడా స్థానచలనాలు కల్పించారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే కొత్త విధి స్థానాల్లో చేరాలని ఎస్పీ కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఈ బదిలీలు సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖలో పరిపాలనా కారణాలతో చేపట్టినట్లు సమాచారం.

## ఎరువుల దుకాణాలపై ఏడీఎం ఆకస్మిక తనిఖీలు



అందోల్, సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి, జూన్ 18, 2026: అందోల్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో వ్యవసాయశాఖ అదనపు సంచాలకురాలు (ఏడీఎం) రుమాదేవి ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని ఎరువుల నిల్వలు, విత్తనాల స్టాక్‌లు, రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని, నిర్ణీత ధరలకే విక్రయించాలని దుకాణదారులకు సూచించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయించడం, నిల్వల విషయంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వ్యవసాయ శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగిస్తుందని తెలిపారు. ఈ తనిఖీల్లో సంబంధిత శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఎన్యుమరేటర్లపై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి, సందేశం టైమ్స్, సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 18, 2026: సంగారెడ్డి జిల్లాలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ ఎన్యుమరేటర్లు, కాంగ్రెస్ కార్యకర్తలు, సానుభూతిపరులు ఒక్కటై పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లే బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. నాయకులకు, కార్యకర్తలకు ప్రజలతో నిరంతర సంబంధాలు ఉండాలని, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అందరూ సమన్వయంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన శిక్షణ శిబిరం






సంగారెడ్డి, సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్, జూన్ 18, 2026: సంగారెడ్డి నియోజకవర్గ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) పై బూత్ లెవెల్ ఏజెంట్స్ (BLA) లకు నిర్వహించిన అవగాహన మరియు శిక్షణ శిబిరంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గార్లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ఓటర్లను చేర్చడం, డూప్లికేట్ లేదా అర్హతలేని పేర్లను తొలగించడం మరియు ఓటర్ జాబితాలో తప్పులను సరిచేయడం కోసం చేపట్టే కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ పలు విలువైన సూచనలు చేశారు. ఎస్ఐఆర్ పై ప్రతి ఒక్క కార్యకర్త పూర్తి అవగాహన తెచ్చుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి, తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు తూర్పు జయప్రకాష్ రెడ్డి (జగ్గారెడ్డి), పఠాన్ చెరువు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్, నీలం మధు ముదిరాజ్ మరియు సంగారెడ్డి జిల్లా ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఖాజిపల్లి జిఎంఆర్ కాలనీలో ప్రజలకు సకల సౌకర్యాలు – ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



జిన్నారం, సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్, జూన్ 18, 2026: గడ్డ పోతారం మున్సిపల్ పరిధిలోని ఖాజిపల్లి జిఎంఆర్ కాలనీలో ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని, త్వరలోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టబోతున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం ఖాజిపల్లి పరిధిలోని జిఎంఆర్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీలలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా సర్వేనెంబర్ 181 లో ప్రజల సౌకర్యార్థం గుడి, మసీదు, చర్చి, స్మశాన వాటిక, అంగన్వాడి, చట్ పూజ ఘాట్, క్రీడా మైదానం, ప్రాథమిక పాఠశాల నిర్మాణాలకు త్వరలో స్థలాలు కేటాయించి, భవన నిర్మాణాల పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. జర్నలిస్ట్ కాలనీలో సీసీ రోడ్లు, అంతర్గత మురుగునీటి కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జిఎంఆర్ కాలనీలో గ్రామ దేవత గుడి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుష్మ శ్రీకాంత్, తహసిల్దార్ ఆంథోనీ, మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాలేరులో ఘనంగా బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు అవగాహన సమావేశం - కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన కేటీఆర్





పాలేరు, సందేశం టైమ్స్, ఖమ్మం ఇన్చార్జ్ శెట్టి సురేష్, జూన్ 18, 2026: పాలేరు నియోజకవర్గంలోని వెంకటగిరి క్రాస్ రోడ్ శ్రీ హర్ష కన్వెన్షన్ నందు పాలేరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, SIR ఓటర్ నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన సమావేశం ఘన విజయవంతమైంది. ఈ సమావేశానికి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో సభా ప్రాంగణమంతా గులాబీమయంగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారకరామారావు గారు హాజరై పాలేరు బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణ మరియు అవగాహన కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గారు, ఎమ్మెల్సీ మరియు ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తాత మధుసూదన్ గారు, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందరావు గారు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు గారు, రెడ్యా నాయక్ గారు, మాజీ ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమలరాజ్ గారు, రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి గారు, బొమ్మెర రాంమూర్తి గారు మరియు పాలేరు మాజీ ఎమ్మెల్యే శ్రీ కందాళ ఉపేందర్ రెడ్డి గారు తదితరులు పాల్గొని విజయవంతం చేశారు.

## రాంపూర్ కాలనీలో మురుగునీటి కాలువలు నిర్మించాలి – సీపీఎం డిమాండ్





కొల్చారం, సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 18, 2026: మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని రాంపూర్ కాలనీలో మురుగునీటి కాలువలు వెంటనే నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె. నర్సమ్మ డిమాండ్ చేశారు. పార్టీ చేపట్టిన స్థానిక సమస్యల క్యాంపెయిన్‌లో భాగంగా రాంపూర్ కాలనీలో నిర్వహించిన సర్వే సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో సుమారు 100 కుటుంబాలు నివాసముంటున్నాయని, ఇళ్లలో వాడిన మురుగునీరు బయటకు వెళ్లడానికి డ్రైనేజీ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా వర్షాకాలంలో పడిన వర్షపు నీరంతా ఇళ్ల మధ్యలోనే నిలిచిపోతుందని, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నుండి మెదక్ - హైదరాబాద్ ప్రధాన రహదారి వరకు ఒక పెద్ద మురుగు కాలువ నీరు ఎటు వెళ్లకుండా ఎక్కడికక్కడ నిలిచిపోవడం వల్ల దోమలు, పురుగులు వృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. వర్షాకాలంలో విషసర్పాలు, తేళ్లు ఇళ్లలోకి వస్తుండటంతో ప్రజలు తీవ్ర భయబ్రాంతులకు లోనవుతున్నారని తెలిపారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించకపోవడం అన్యాయమని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రాంపూర్ కాలనీలో మురుగునీటి కాలువలను నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని సీపీఎం పార్టీ తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## చింతకాని నూతన ఎస్ఐ నరేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రెస్ క్లబ్ సభ్యులు



చింతకాని, సందేశం టైమ్స్, ఖమ్మం ఇన్చార్జ్ శెట్టి సురేష్, జూన్ 18, 2026: చింతకాని పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నరేష్ ను చింతకాని ప్రెస్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ, ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువై శాంతి భద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. చింతకాని మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి మీడియా మరియు పోలీసు శాఖల మధ్య సమన్వయం కొనసాగాలని పేర్కొన్నారు. అనంతరం ఎస్సై నరేష్ మాట్లాడుతూ, ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్టబద్ధమైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామని, ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతకాని ప్రెస్ క్లబ్ అధ్యక్షురాలు జొన్నలగడ్డ మల్లేశ్వరి, ప్రజా దర్బార్ గడ్డం విజయ్, అంబటి శాంతయ్య, శెట్టి సురేష్, ఆర్గాన్ న్యూస్ రామారావు, కోటేశ్వరరావు, సి కె న్యూస్ పిచ్చయ్య, గద్దర్ న్యూస్ కరుణాకర్, రణధీర్, టైమ్స్ ఆఫ్ వార్త జొన్నలగడ్డ సందీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తాలేల్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలు వెంటనే పరిష్కరించాలి – సీపీఎం నేత జి సాయిలు





అందోల్, సందేశం టైమ్స్, అందోల్ ప్రతినిధి, జూన్ 18, 2026: సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలోని తాలేల్మ గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి సాయిలు ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్స్‌రే, ల్యాబ్ సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి అక్కడి సమస్యలను పరిశీలించారు. వట్పల్లి, ఆందోల్ మండలాలకు చెందిన అనేక గ్రామాల ప్రజలు ఈ కేంద్రానికి వైద్య సేవల కోసం వస్తున్నారని, అయితే అవసరమైన మౌలిక సదుపాయాల లేమితో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని, ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, పాము కాటుకు సంబంధించిన మందులు నిల్వ ఉంచాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే, ల్యాబ్ సౌకర్యాలు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఎక్స్‌రే, ల్యాబ్ ఏర్పాట్లు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ప్రజల తరఫున పోరాటం కొనసాగిస్తామని జి సాయిలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆందోల్ డివిజన్ కార్యదర్శి డి. విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలు, ప్రాథమిక పాఠశాలలు బలోపేతం కావాలి – జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్







నర్సాపూర్, సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 18, 2026: జిల్లావ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీలు మరింత బలోపేతం కావాలని, వయస్సును బట్టి అంగన్వాడీ కేంద్రాలు మరియు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలలను డీఆర్డీఓ, డీఈఓ, డీడబ్ల్యూఓ, గ్రామ సర్పంచ్‌లతో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంగన్వాడి కేంద్రంలోని చిన్నారులతో ముచ్చటించి, అనంతరం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్వాడీలు, ప్రీ స్కూల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యాలతో పాటు అన్ని వసతులు కల్పించి విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా, ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దాలని సూచించారు. అంగన్వాడి టీచర్లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమన్వయంతో వ్యవహరిస్తూ విద్యార్థుల వయస్సును బట్టి అంగన్వాడి, ప్రాథమిక పాఠశాలల్లో నమోదు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, ఏఎంఓ సుదర్శన్ మూర్తి, ఎంఈఓ తారా సింగ్, సంబంధిత అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రాంసాన్ పల్లిలో ఇందిరమ్మ ఇంటి నూతన గృహప్రవేశం – రిబ్బన్ కట్ చేసిన సర్పంచ్ పండుగ హనుమంత్





అందోల్, సందేశం టైమ్స్, అందోల్ ప్రతినిధి, జూన్ 18, 2026: సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలంలోని రాంసాన్ పల్లి గ్రామంలో కుమ్మరి లక్ష్మి బాగయ్య నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ పండుగ హనుమంత్ ముఖ్యఅతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ నూతన గృహంలోకి అడుగుపెడుతున్న లక్ష్మి బాగయ్య కుటుంబ సభ్యులకు తన వంతుగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ శుభకార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# మూసివేసిన ప్రభుత్వ బడులను వెంటనే పునఃప్రారంభించాలి – సీపీఎం డిమాండ్



మెదక్, సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 18, 2026: మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే యధావిధిగా కొనసాగించాలని, బడుల తొలగింపు ఆలోచనను పూర్తిగా మానుకోవాలని సీపీఎం పార్టీ మెదక్ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కే. నర్సమ్మ మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న 903 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 70 వేల మంది పేద విద్యార్థుల విద్యా హక్కును నేటి కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తోందని మండిపడ్డారు. ఒక ప్రాంతం లేదా జిల్లా అభివృద్ధి చెందాలంటే అక్కడి ప్రజలందరూ అక్షరాస్యులై ఉండాలని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అంచలంచెలుగా ప్రభుత్వ బడులను తొలగిస్తూ పేదలకు విద్యను దూరం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో ఇప్పటికే 30 పాఠశాలలు మూసివేయబడ్డాయని, మరో 115 పాఠశాలలను తొలగించడానికి ప్రభుత్వం సిద్ధపడుతోందని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసి మౌలిక వసతులు కల్పించాల్సింది పోయి, బడులను మూసివేయడం ద్వారా పరోక్షంగా ప్రైవేటు విద్యాసంస్థలకు ప్రభుత్వం దారులు తెరుస్తోందని విమర్శించారు. పాఠశాలల్లో తాగునీరు, మూత్రశాలలు, మధ్యాహ్న భోజన వంటశాలల వంటి కనీస సౌకర్యాల లోపం ఉందని, అలాగే ఉపాధ్యాయులు, పీటీ టీచర్ల పోస్టులు ఎన్నో ఖాళీగా ఉన్నాయని, వాటిని చిత్తశుద్ధితో వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రతి పాఠశాలకు లైబ్రరీ, ఆటస్థలం, ఆట వస్తువులను అందించాలని హితవు పలికారు. మండలానికి ఒక పాఠశాల నిర్మిస్తామని గొప్పలు చెబుతూ, గ్రామాలు మరియు తండాల్లోని బడులను మూసివేస్తే పేద విద్యార్థులు కిలోమీటర్ల దూరం వెళ్లలేక చదువుకు దూరమవుతారని, దీనివల్ల నిరక్షరాస్యత మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకుని ఇప్పటికే మూసివేసిన బడులను పునఃప్రారంభించాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో పేద విద్యార్థుల తల్లిదండ్రులను ఐక్యం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం జిల్లా కమిటీ హెచ్చరించింది.

## కురవి, డోర్నకల్‌లో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహణ



కురవి, సందేశం టైమ్స్, మహబూబాబాద్ ,స్టేట్ కోఆర్డినేటర్ టీ. సంగమేశ్వర్, జూన్ 18, 2026: మహబూబాబాద్ జిల్లా మానుకోట పరిధిలోని కురవి మండల కేంద్రంలో వీరభద్ర స్వామిని దర్శించుకున్న అనంతరం కురవి పట్టణంలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. దీనితో పాటు డోర్నకల్ నియోజకవర్గ హెడ్‌క్వార్టర్‌లో కూడా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతంగా చేపట్టారు. ఈ కార్యక్రమాలలో మహబూబాబాద్ జిల్లా టీఆర్ఎస్ ఇంచార్జ్ డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, జిల్లా పరిశీలకులు కిషన్ నాయక్, జిల్లా సీనియర్ నాయకురాలు మారుపెల్లి మాధవి, డోర్నకల్–మహబూబాబాద్ నియోజకవర్గాల పరిశీలకులు అభిలాష్ గౌడ్, డోర్నకల్ ఇంచార్జ్ బోడ అనిల్ నాయక్, మహబూబాబాద్ ఇంచార్జ్ గంధసిరి వేణు, సీనియర్ నాయకులు సంగెం హర్షిత్, రాజేష్ గౌడ్, జన్ను సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య నాయకులు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీని గ్రామ స్థాయి నుండి మరింత బలోపేతం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త, నాయకుడు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## మోదీ 12 ఏళ్ల సుపరిపాలన సందర్భంగా సంగారెడ్డిలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో పోటీలు



సంగారెడ్డి, సందేశం టైమ్స్, స్టేట్ కోఆర్డినేటర్ టి. సంగమేశ్వర్, జూన్ 18, 2026: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 12 ఏండ్ల సుపరిపాలన సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని గాంధీ స్కూల్‌లో బీజేపీ సంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా కమిటీ ఆధ్వర్యంలో డ్రాయింగ్ మరియు వంటల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ రావు దేశ్‌పాండే, సంగారెడ్డి పట్టణ అధ్యక్షులు వాసు, విజయ్, సీనియర్ నాయకులు తులసిరెడ్డి, నాగరాజ్, మహిళా మోర్చా నాయకురాలు జోష్నా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ సమగ్ర అభివృద్ధిలో మహిళలు, యువత పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు.

# జూన్ 20న రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నిధులు – ఈ-కేవైసీ పూర్తి చేసిన వారికే జమ



హైదరాబాద్, సందేశం టైమ్స్, స్టేట్ కోఆర్డినేటర్ టీ. సంగమేశ్వర్, జూన్ 18, 2026: దేశవ్యాప్తంగా ఉన్న రైతులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 23వ విడత నిధులను జూన్ 20న విడుదల చేయనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ పథకం ద్వారా అర్హులైన రైతులకు సంవత్సరానికి రూ.6 వేల ఆర్థిక సాయం అందజేస్తూ, మూడు విడతలుగా ఒక్కోసారి రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా 9 కోట్లకు పైగా రైతులు లబ్ధి పొందనున్నట్లు అధికారులు తెలిపారు. అయితే ఈ-కేవైసీ పూర్తి చేసిన రైతులకే ఈ నిధులు జమ అవుతాయని స్పష్టం చేశారు. రైతులు తమ వివరాలను సకాలంలో ధృవీకరించుకోవాలని సూచించారు.

## కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి – జంగన్న గౌడ్



సంగారెడ్డి, సందేశం టైమ్స్, ప్రతినిధి, జూన్ 18, 2026: సంగారెడ్డి పట్టణంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జంగన్న గౌడ్ మాట్లాడుతూ ఈనెల 22, 23 తేదీలలో హైదరాబాద్‌లోని జై సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, కమిటీ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు తప్పనిసరిగా హాజరై శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణలో కల్లుగీత వృత్తి పుట్టుక, ఉద్యమ చరిత్ర, పారిశ్రామిక సహకార సంఘాల ఏర్పాటు, సర్దార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర, ఇతర రాష్ట్రాలలో కల్లుగీత వృత్తి పరిస్థితులు, ప్రభుత్వ విధానాలు, ఎక్సైజ్ శాఖ, బీసీ కార్పొరేషన్ పాత్ర, ఈత–తాటి చెట్ల పెంపకం, వృత్తి రక్షణకు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, సంఘ నిర్మాణం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు రామా గౌడ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యాదగౌడ్, సంగారెడ్డి అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా నాయకులు ప్రవీణ్ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మానూర్ మండలంలో పంచాయతీ కార్యదర్శులకు ఆత్మీయ వీడ్కోలు – నూతన కార్యదర్శులకు ఘన స్వాగతం



మనూర్, సందేశం టైమ్స్, ప్రతినిధి, జూన్ 18, 2026: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మానూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ వీడ్కోలు, నూతన కార్యదర్శుల స్వాగత సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డివిజన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డివిజనల్ పంచాయతీ అధికారికి శాలువా, పూలమాలలతో ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్తున్న పంచాయతీ కార్యదర్శులకు ఆత్మీయ వీడ్కోలు పలుకుతూ వారు మండల అభివృద్ధికి అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. అలాగే బదిలీపై మానూర్ మండలానికి నూతనంగా వచ్చిన కార్యదర్శులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బదిలీలు ఉద్యోగ జీవితంలో సహజమైన భాగమని, కొత్తగా వచ్చిన కార్యదర్శులు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలతో సమన్వయం చేసుకుంటూ గ్రామాభివృద్ధి, పారిశుధ్యం, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పనలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల సేవలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, మండలంలోని వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జోగిపేట నూతన ఎస్ఐ శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సర్పంచ్, గ్రామ పెద్దలు



జోగిపేట, సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 18, 2026: సంగారెడ్డి జిల్లా జోగిపేట కేంద్రంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) శ్రీ శ్రీకాంత్‌ను నేరేడు గుంట గ్రామ సర్పంచ్ ఒగ్గు సాయి కిరణ్ యాదవ్, ఉపసర్పంచ్ మరియు గ్రామ పెద్దలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ తమ వంతు పూర్తి సహకారం అందించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో, శాంతిభద్రతల నిర్వహణలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నేరేడు గుంట గ్రామ సర్పంచ్ ఒగ్గు సాయి కిరణ్ యాదవ్, గ్రామ ఉపసర్పంచ్ కొండంద ఈశ్వర్, గ్రామ పెద్దలు వీరేశం, మన్నే పరిపూర్ణ, స్థానిక గ్రామ వార్డు మెంబర్లు, సభ్యులు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పోసానిపేట్ జడ్పీ ఉన్నత పాఠశాలలో త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



అందోల్, సందేశం టైమ్స్, అందోల్ మండల ప్రతినిధి, జూన్ 18, 2026: అందోల్ మండలంలోని పోసానిపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న త్రాగునీటి సమస్యకు గ్రామ ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం కల్పించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో గ్రామ ఉపసర్పంచ్ జి. రాములు, వార్డు సభ్యులు వి. వెంకటేశం, జి. సుధాకర్, మన్నె యాదగిరి సమస్యను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టారు. జేసీబీ సహాయంతో పైప్‌లైన్ కోసం కాలువ తవ్వించి, త్రాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు చేసి పాఠశాలకు నీటి కనెక్షన్ అందించారు. ఈ పనులు పూర్తికావడంతో విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులోకి రాగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు గ్రామ ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా ఉపసర్పంచ్ జి. రాములు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధి దృష్ట్యా త్రాగునీటి సమస్యను ప్రాధాన్యతగా తీసుకుని పరిష్కరించినట్లు వార్డు సభ్యులు పేర్కొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రజాప్రతినిధుల సేవలను అభినందిస్తూ కృతజ్ఞతలు తెలపగా, విద్యార్థులకు మంచినీటి సమస్య తొలగిపోవడంతో తల్లిదండ్రులు కూడా సంతోషం వ్యక్తం చేశారు.

## బోర్పట్ల గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆవుల రాజిరెడ్డి



బోర్పట్ల, సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 18, 2026: హథ్నూర మండలంలోని బోర్పట్ల గ్రామంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ ఆవుల రాజిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలోని 2BHK కాలనీ వద్ద మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (NREGS) నిధులతో మరియు గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని వ్యవసాయ రహదారుల అభివృద్ధి పనులను ప్రారంభించి, రైతులకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బోర్పట్ల ఎంపీపీఎస్ (MPPS), జెడ్పీహెచ్ఎస్ (ZPHS) పాఠశాలలలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తూ, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించడంతో పాటు బోర్పట్ల, పాల్పనూర్, గుండ్లమాచునూర్ గ్రామాల విద్యార్థుల కోసం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు అందజేసిన స్కూల్ బస్సును జెండా ఊపి ప్రారంభించి విద్యార్థులకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి, రైతుల సంక్షేమం, విద్యార్థుల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తామని, ప్రజలకు ఉపయోగపడే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను తీసుకురావడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ముగింపు దిశగా ధాన్యం కొనుగోళ్లు – రైతులకు 846 కోట్ల రూపాయల చెల్లింపు: కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 18, 2026: మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముగింపు దిశకు చేరుకున్నాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 93,950 మంది రైతుల నుంచి 4,10,166.480 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, అందులో 81,301 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో 846.00 కోట్ల రూపాయలను విజయవంతంగా జమ చేశామని వివరించారు. జిల్లాలో లక్ష్యానికి అనుగుణంగా ఇప్పటివరకు 507 ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోళ్లు పూర్తి కావడంతో వాటిని మూసివేసినట్లు పేర్కొన్నారు. రైతులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని, క్షేత్రస్థాయిలో ఉన్న ధాన్నియాన్నంతటినీ చివరి గింజ వరకు కొనుగోలు చేయడానికి ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉందని కలెక్టర్ బుధవారం ఒక ప్రకటనలో రైతులకు భరోసా ఇచ్చారు.

## విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ




అల్లాదుర్గం, సందేశం టైమ్స్, మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్, జూన్ 18, 2026: అందోల్ నియోజకవర్గంలోని అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను మండల విద్యాధికారి లక్ష్మణ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచిత పాఠ్య సామగ్రి, యూనిఫాంలు తదితర సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని చదువుపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్న మండవలో భారీగా పేలుడు పదార్థాల స్వాధీనం – ఇద్దరి అరెస్ట్, ఒకరు పరారీ



చింతకాని, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 18, 2026: చింతకాని మండల పరిధిలోని చిన్న మండవ గ్రామంలో గురువారం సాయంత్రం పోలీసులు నిర్వహించిన పెట్రోలింగ్ డ్యూటీలో భాగంగా ప్రభుత్వ నిషేధిత పేలుడు పదార్థాలను అక్రమంగా కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని, వారి నుంచి భారీగా జెలటిన్ స్టిక్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చింతకాని సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) నరేష్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. సాయంత్రం 4 గంటల సమయంలో పోలీసు సిబ్బంది చిన్న మండవ గ్రామ పరిసరాల్లో నిఘా ఉంచగా, అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద ఎలాంటి అనుమతులు లేని 67 జెలటిన్ స్టిక్స్‌తో పాటు ఇతర నిషిద్ధ వస్తువులు లభ్యమవడంతో వాటిని వెంటనే స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితులను ఆల్లకుంట్ల నరసింహారావు, వల్లెపు లక్ష్మణ్‌లుగా గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. కాగా, ఈ కేసుతో సంబంధం ఉన్న గుబ్బగుర్తి గ్రామానికి చెందిన కంది మల్లయ్య (S/o లేట్ యల్లయ్య) ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతని కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చేలా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇలాంటి అక్రమ పేలుడు పదార్థాలను కలిగి ఉన్నా లేదా విక్రయించినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నరేష్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

## మాజీ సర్పంచ్ ఎక్కేలి గోపాల్‌కు కడసారి వీడ్కోలు




వాట్పల్లి, సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా ఇంచార్జి కె. సంగమేశ్వర్, జూన్ 18, 2026: సంగారెడ్డి జిల్లా వాట్పల్లి మండలం సాయిపేట గ్రామ మాజీ సర్పంచ్ ఎక్కేలి గోపాల్ మృతితో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే గ్రామ ప్రజలు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు. గ్రామ అభివృద్ధికి విశేష కృషి చేసిన ఎక్కేలి గోపాల్ తన సేవా కార్యక్రమాలు, ప్రజల పట్ల అంకితభావంతో అందరి మన్ననలు పొంది మంచి పేరు సంపాదించుకున్నారు. ఆయన హయాంలో సాయిపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టబడినట్లు ఈ సందర్భంగా గ్రామస్థులు గుర్తు చేసుకున్నారు. బుధవారం నిర్వహించిన అంతిమ యాత్రలో గ్రామ ప్రజలు భారీగా పాల్గొని కడసారి వీడ్కోలు పలికారు. పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహాన్ని సందర్శించి అంజలి ఘటించారు, అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఎక్కేలి గోపాల్ మరణం గ్రామానికి తీరని లోటని గ్రామస్థులు పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ అశ్రునయనాల మధ్య అంత్యక్రియలను ఘనంగా నిర్వహించారు.

## మర్వేల్లిలో నూతన కూరగాయల మార్కెట్, పశువుల సంత ప్రారంభం



మర్వేల్లి, సందేశం టైమ్స్, వట్పల్లి మండల రిపోర్టర్ బస్వరాజు, జూన్ 18, 2026: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని మర్వేల్లి గ్రామంలో ఈ నెల 29వ తేదీ సోమవారం నాడు సర్పంచ్ చిన్నపట్ల మల్లేశ్వరమ్మ ఆధ్వర్యంలో నూతనంగా కూరగాయల మార్కెట్‌తో పాటు పశువుల సంతను ప్రారంభించనున్నారు. గ్రామ ప్రజలు, రైతులకు ఎంతో సౌకర్యంగా ఉండే విధంగా ఈ నూతన మార్కెట్‌ను ప్రభుత్వం, స్థానిక యంత్రాంగం సహకారంతో ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ మార్కెట్‌లో రైతులు తాము కష్టపడి పండించిన కూరగాయలను దళారీల ప్రమేయం లేకుండా నేరుగా విక్రయించుకునే సువర్ణ అవకాశం కల్పించడంతో పాటు పశువులు, గొర్రెలు, మేకల కొనుగోలు మరియు అమ్మకాలకు సంబంధించి అన్ని రకాల ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు. అదేవిధంగా మర్వేల్లి సమీప గ్రామాల వ్యాపారస్తులు, వినియోగదారులు కూడా ఈ కూరగాయల మార్కెట్‌కు వచ్చి నేరుగా కొనుగోలు-అమ్మకాలు నిర్వహించవచ్చని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఈ ప్రాంత రైతు సోదరులు ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మంచి లాభాలు పొందాలని సర్పంచ్ చిన్నపట్ల మల్లేశ్వరమ్మ సూచించారు. సోమవారం నాడు నిర్వహించబోయే ఈ మార్కెట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వట్పల్లి మండల పరిధిలోని గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యాపారులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

## తిర్లాపురం గ్రామంలో కంటి వైద్య శిబిరాన్ని సందర్శించిన చింతకాని ఎస్సై జి.నరేష్





తిర్లాపురం, సందేశం టైమ్స్ ప్రతినిధి, జూన్ 18, 2026: చింతకాని మండల పరిధిలోని తిర్లాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చాపలమడుగు వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వాసన్ ఐ కేర్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని చింతకాని ఎస్సై జి.నరేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ఖమ్మం వాసన్ ఐ కేర్ కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో పేద ప్రజల ఆరోగ్యం కొరకు చేస్తున్న ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో గొప్పవని కొనియాడారు. అనంతరం గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబు మాట్లాడుతూ.. నేత్రదానం కన్నా మిన్నగా ఉన్న చూపును కాపాడుకోవాలనే ఉన్నతమైన ఆశయంతోనే ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన అవగాహన, ఆర్థిక స్తోమత లేక ఎంతోమంది పేద ప్రజలు కంటి పొరలు, కంటిచూపు మందగించడం వంటి సమస్యలతో బాధపడుతున్నారని, వారికి నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చింతకాని ఎస్సై జి.నరేష్, గ్రామ సర్పంచ్ చాపలమడుగు వీరబాబులతో పాటు ఉప సర్పంచ్ గోగుల నాగమణి భర్త నరసింహారావు, గ్రామ కార్యదర్శి ఉమారాణి, అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్, గ్రామ దీపిక, రేషన్ డీలర్ బండి యాకోబు, వార్డు సభ్యులు ఐతం విజయ, యూత్ అధ్యక్షుడు బండి సైదులు, మరీదు మధు, వెంకన్న, ప్రసాదు, నాగేశ్వరరావు మరియు స్థానిక గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు.

## పరిశుభ్రతే ప్రగతికి పునాది – బోనకల్‌ను బహిరంగ మల విసర్జన రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం



బోనకల్, సందేశం టైమ్స్, ఖమ్మం ఇన్‌చార్జ్ శెట్టి సురేష్, జూన్ 18, 2026: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రగతి కార్యాచరణలో భాగంగా బోనకల్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామ పంచాయతీ యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతోందని బోనకల్ సర్పంచ్ జ్యోతి, ఉప సర్పంచ్ బానోతు కొండ తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రతి కుటుంబం పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా కాలువల్లో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. కాలువల్లో చెత్త వేయడం వల్ల మురుగునీరు నిలిచి దోమలు, వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని, నిబంధనలను ఉల్లంఘిస్తే గ్రామ పంచాయతీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. అలాగే, ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన సామూహిక మరుగుదొడ్లను ప్రతి ఒక్కరూ వినియోగించి, గ్రామాన్ని బహిరంగ మల విసర్జన రహిత (ODF) గ్రామంగా నిలబెట్టడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో గ్రామ పరిధిలోని వ్యాపారస్తులు తమ వ్యాపార అనుమతి పత్రాలను వెంటనే గ్రామ పంచాయతీ కార్యాలయంలో పునరుద్ధరించుకోవాలని, లేనిపక్షంలో నిబంధనల ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. గ్రామాభివృద్ధి అనేది కేవలం అధికారులు, ప్రజా ప్రతినిధుల బాధ్యత మాత్రమే కాదని, ప్రజల సామాజిక బాధ్యత మరియు భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఇరిగేషన్ అధికారి కొండలరావు, పంచాయతీ కార్యదర్శి కోలా రాజేశ్వరి, సహకార సంఘం మాజీ అధ్యక్షులు గుండపనేని సుధాకర్ రావు, గ్రామ పెద్దలు తెల్లాకుల శ్రీనివాసరావు, బిళ్ళ విశ్వనాథం, గుగులోతు రమేష్, టేకులపల్లి సాంబయ్య, గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు యార్లగడ్డ కుమారి, మరిదు శేషు, అంతోటి శ్రీను, పోటు వెంకటేశ్వర్లు, అంతోటి సునీత, షేక్ మేర సాహెబ్, జరుపల లావణ్య, తాలూరి జ్యోతి, ఉప్పర శ్రీను, షేక్ నౌషిన్, బదావత్ హుస్సేన్, నిమ్మల రాజశేఖర్, కలవల బాబు, సాయి కృష్ణ, వేమా లలిత, విజయ్, జిడుగు వెంకటేశ్వర్లు, బోడ అంజి, యోగి శ్రీనివాస్, జర్పల శివకృష్ణ, జూపల్లి వెంకటేశ్వర్లు, ధారావతు సాధు, స్థానిక వ్యాపారస్తులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కార్యకర్తలకు, సోషల్ మీడియా వారియర్స్‌కు అండగా ఉంటాం: మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్





మెదక్, సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గం ప్రతినిధి, జూన్ 18, 2026: సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వాన్ని, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న అశోక్ కుమార్ అనే యువకుడిని జహీరాబాద్ పోలీసులు అక్రమ కేసులతో అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారనే విషయం తెలిసిన వెంటనే ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ స్పందించారు. అరెస్ట్ సమాచారం అందిన కొద్ది నిమిషాల్లోనే ఆయన నేరుగా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని అశోక్ కుమార్‌ను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం తప్పుడు మరియు అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని, ఇలాంటి బెదిరింపులకు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని, అక్రమ అరెస్టులతో గొంతు నొక్కలేరని అన్నారు. కార్యకర్తలు, సోషల్ మీడియా వారియర్స్ ఎవరూ కూడా అధైర్యపడొద్దని, మీకు ఏ కష్టం వచ్చినా కంటికి రెప్పలా కాపాడుకోవడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని భరోసా కల్పించారు. చట్టపరమైన పోరాటానికైనా, ప్రజా క్షేత్రంలో పోరాటానికైనా కార్యకర్తలకు తన పూర్తి మద్దతు ఉంటుందని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.